సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 16 । జూన్ । 2024



పడకేసిన వన్‌ధన్ కేంద్రాలు..
మన్యంలో ఏర్పాటు చేసిన వీడీవీకేల (వన్‌ధన్ వికాస్ కేంద్రాలు) లక్ష్యం నీరుగారుతోంది. - 8లో



ఇదేమి చోద్యం..! - 8లో
నెల్లిమర్ల మండలంలోని సతివాడ గ్రామంలో నిరుపేదలకు ఇచ్చిన స్థలాల్లో తోటపల్లి ప్రాజెక్ట్ పిల్ల కాలువ తవ్వకాలపై లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గంజాయితో ఒకరి అరెస్ట్
ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి నుంచి 49 కిలోల గంజాయిని తరలిస్తున్న వంతల డంబును పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు

- జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు

విజయనగరం ఫోర్ట్: బక్రీద్ పండగ (ఈ నెల 17) సందర్భంగా జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అక్రమ పశువధ, జంతు రవాణా నేరమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రిజర్వేషన్ అండ్ ప్రొహిబిషన్ ఆఫ్ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ ఆఫ్ యానిమల్ రూల్స్-1978, 2001 జంతు సంక్షేమ చట్టాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై జిల్లాలో పశు సంవర్ధక శాఖ అధికారులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు దృష్టి సారించాలని ఆదేశించారు.

గోమాతకు సీమంతం



పుంగనూరు గోవుకు సీమంతం చేస్తున్న భక్తులు

గుర్ల: మండల కేంద్రంలోని శివాలయంలో పుంగనూరు గోవుకు భక్తులు శనివారం సీమంతం చేశారు. శివాలయంలో గోమాతకు శ్రీమంతం చేయడం ఇదే మొదటిసారి అని ఆలయ అర్చకుడు సురేష్ శర్మ తెలిపారు. మహిళలకు తాంబులాలు ఇచ్చారు. గోవుల పరిరక్షణకు అందరు కృషి చేయాలని భక్తులు పిలుపునిచ్చారు.

జాబ్‌మేళాకు 89 మంది హాజరు



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ

విజయనగరం ఫూల్‌బాగ్: జాబ్ డీలర్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి జిల్లా ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు 89 మంది హాజరయ్యారు. వీరిలో 42 మందిని తదుపరి రౌండ్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ మాట్లాడుతూ ఉపాధి కల్పన కోసం ఏర్పాటుచేస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంలు కె.రామచంద్రరావు, కె.లక్ష్మణరావు, హెచ్‌ఆర్ సందీప్, యంగ్ ప్రొఫెషన్ ఎం.యశ్వంత్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

స్పందన పేరు మార్పు

విజయనగరం అర్బన్: ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమం పేరు మారింది. ఇక నుంచి ఈ కార్యక్రమాన్ని పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసిల్ సిస్టమ్‌గా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకున్న నటరాజ బృందం భజన కీర్తనలు



పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి సన్నిధిలో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం తొగరాం గ్రామానికి చెందిన నటరాజ భజన బృందం 25 మంది సభ్యులు అమ్మవారిని స్తుతిస్తూ శనివారం భజనలు చేశారు. భక్తి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు భజన బృంద సభ్యులను దుశ్శాలువలతో సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, పైడితల్లి అమ్మవారి దీక్షా పీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో భజనలు చేస్తున్న నటరాజ భజన బృందం

‘ఆణిముత్యం’ అందేనా?



పార్వతీపురం కేపీఎం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

- నగదు పురస్కారాల కోసం ప్రతిభావంతుల ఎదురుచూపు
- పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన వారికి గత ప్రభుత్వం ‘ఆణిముత్యాలు’ పేరుతో సత్కారం
- పదోతరగతి టాపర్లకు రూ.లక్ష బహుమతి ప్రదానం
- నియోజకవర్గ, జిల్లా స్థాయి విజేతలకు నగదు ప్రోత్సాహకాలు
- ఈ ఏడాది ఇంతవరకు అందని మార్గదర్శకాలు

పార్వతీపురంటౌన్:

ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ఠం చేయడం... ప్రభుత్వ బడుల్లో చదువుకునే ప్రతిభావంతులను ప్రోత్సహించి మిగిలిన విద్యార్థుల్లో స్ఫూర్తినింపేందుకు గత ప్రభుత్వం పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ‘ఆణిముత్యాలు’ పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించింది. ఈ పథకాన్ని ఏటా అమలు చేయనున్నట్టు ఆ సమయంలో స్పష్టం చేసింది. దీంతో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ ఏడాది కూడా నగదు ప్రోత్సాహకాలు అందుతాయని భావించారు. పదో తరగతి విద్యార్థులకు మాత్రమే కాకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు సైతం గత ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేసింది. ప్రతి గ్రూపులో టాపర్లను ఎంపిక చేసి వారికి నగదు ప్రోత్సాహకాలతో సత్కరించింది. ఆణి ముత్యాలుగా ఎంపికైన విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను, నగదు పురస్కారం అందుకున్న విద్యార్థుల తలిదండ్రులను కూడా ప్రభుత్వం ఘనంగా సత్కరించి గౌరవించింది. కొత్త ప్రభుత్వం కూడా అలా చేయాలని విద్యార్థి, ఉపాధ్యాయలోకం కోరుతోంది. ఆశగా ఎదురుచూస్తోంది.

జిల్లా, నియోజకవర్గాల స్థాయిలోనూ...

విజేతలకు నగదు ప్రోత్సాహకాలు కేవలం రాష్ట్ర స్థాయికే పరిమితం చేయకుండా నియోజకవర్గ, జిల్లా స్థాయికి వర్తింపజేశారు. నియోజకవర్గ స్థాయిలో టాపర్లకు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు అందజేశారు. జిల్లా స్థాయిలో టాపర్లకు రూ.50 వేలు, ద్వితీయ స్థానం రూ.30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు అందించారు. ఈ రెండు స్థాయిల్లో కూడా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందాయి. కొన్ని ప్రాంతాల్లో స్థానిక దాతల సహకారంతో పాఠశాల స్థాయిలో టాపర్లకు ప్రథమ స్థానానికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

ఇప్పటి వరకు అందని మార్గదర్శకాలు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అమలు చేసిన ఆ పథకానికి గత ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి గొప్ప స్పందన లభించింది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని, ఈ పథకాన్ని భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని కోరారు. గత ఏడాది జూన్ 20 నాటికి అన్ని స్థాయిల్లో నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమాలు పూర్తి చేశారు. ఈ ఏడాది విద్యార్థులకు ఇలాంటి నగదు పురస్కారం అందుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. జిల్లా విద్యాశాఖాధికారులకు ఎటువంటి మార్గదర్శకాలు అందకపోవడంతో ఈ ఏడాది నగదు ప్రోత్సాహకాలు ఇస్తారా? లేదా? అన్న సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది.

గత ఏడాది టాపర్లకు రూ.లక్ష బహుమతి

ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో వివిధ గ్రూపులు చదివిన విద్యార్థుల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి రూ.లక్ష నగదు ప్రోత్సాహకం అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 50 వేలతో పాటు సర్టిఫికెట్, మెడల్స్ ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు.



ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం



మాట్లాడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

- మంత్రి సంధ్యారాణి

సాలూరు: టీడీపీ కూటమి ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, తమకు రాష్ట్రాభివృద్ధే ప్రధాన అజెండా అని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఉత్తమ పాలన అందించడానికి కృషి చేస్తామన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా చూస్తామని చెప్పారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకం చేపడతామని తెలిపారు. అన్ని వేళలా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. పెంచిన పింఛన్‌ను ఈ నెలలోనే అందిస్తామని చెప్పారు. పట్టణంలోని సామాజిక మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించానని తెలిపారు. అలాగే గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యం కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈదుర గాలులకు విరిగిన చెట్లు



భామిని రోడ్డుపై కూలిన భారీ వేపచెట్టు

భామిని: మండలంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదుర గాలుల ధాటికి పూరిళ్ల కమ్ములు, ఇళ్లపై రేకులు ఎగిరిపడ్డాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఏబీ రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలతో బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగింది. భామిని మండల కేంద్రంలో రోడ్డుపై విరిగిపడిన భారీ వేప చెట్టుతో వాహనరాకపోకలు నిలిచిపోయాయి. బస్సులు దిగి ప్రయాణికులు ఏకలవ్య స్కూల్ రోడ్డు గుండా మండల కేంద్రానికి చేరుకున్నారు. సింగిడి వద్ద రోడ్డుపై కూలిన చింత చెట్టును స్థానికులు తొలగించారు. విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

రక్తదానం సామాజిక బాధ్యత




రక్తదానం చేస్తున్న దాతలు

- గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి

విజయనగరం ఫోర్ట్: రక్తదానం సామాజిక బాధ్యత అని గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక రోజున రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. రక్తదాతలే ప్రాణదాతలని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ఏడాదికి ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి అనారోగ్యం దరిచేరదన్నారు. అపోహలు వీడాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్, రెడ్ క్రాస్ కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.

తొలిరోజు చింతపల్లి తీరంలో వేట ముగించి బోటులో ఒడ్డుకు చేరుకుంటున్న మత్స్యకారులు



చేపల వేట ఆరంభం

- 61 రోజుల విరామం తరువాత ఉత్సాహంగా వేటకు వెళ్లిన మత్స్యకారులు
- జిల్లాలో మొదటిరోజు 420 బోట్లపై వేటకు..
- తొలుత గంగమ్మతల్లికి పూజలు
- మత్స్యసంపదతో తిరిగి ఒడ్డుకు..



వలకు చిక్కిన మత్స్యసంపద కొనుగోలుకు పోటీ పడుతున్న వ్యాపారులు

పూసపాటిరేగ: సముద్రంలో వేట నిషేధం గడువు ముగిసింది. మత్స్యకారులు శనివారం తెల్లవారు జామున వేటకు శ్రీకారం చుట్టారు. పూసపాటిరేగ, భోగాపురం తీరప్రాంతంలోని మత్స్యకారులు తొలుత గంగమ్మతల్లికి పూజలు చేశారు. అనంతరం 420 బోట్లలో సముద్రంలో వేటకు బయలుదేరారు. చింతపల్లి, పతివాడ బర్రిపేట, తిప్పలవలస, తమ్మయ్యపాలెం, పులిగెడ్డపేట, ముక్కాం, చేపలుకంచేరు, కొండ్రాజు పాలెం రేవుల నుంచి వేట సాగించారు. సాధారణ వలకు ముగ్గురు, ఇంజిన్‌బోటుపై ఆరు నుంచి ఎనిమిది మంది వరకు సుమారు 5 నుంచి 20 కిలో మీటర్ల దూరం వరకు సంద్రంలోకి వెళ్లారు. వలకు చేపలు చిక్కిన వారు మధ్యాహ్నం 12 గంటలకు ఒడ్డుకు చేరుకున్నారు. ఒక్కో బోటుకు రూ.6వేలు నుంచి రూ.15వేలు విలువచేసే మత్స్యసంపద దొరకడంతో సంతోషం వ్యక్తంచేశారు. తీరంలోనే చేపలను విక్రయించారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని తాటిపూడి ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో గెస్ట్ టీచర్ (పీజీటీ)గా పనిచేయడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జేఎస్ సంధ్యా భార్గవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, గణితం, భౌతిక శాస్త్రం సబ్జెక్ట్‌ల్లో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ, బీఎడ్ విద్యార్హత కలిగి బోధనలో అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 19వ తేదీలోగా తాటిపూడిలోని గురుకుల పాఠశాలలో స్వయంగా దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 87126 25024 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బంగారునాయుడుకు పతంజలి పురస్కారం


పతంజలి పురస్కారాన్ని అందుకుంటున్న కవి, రచయిత రౌతు బంగారునాయుడు

విజయనగరం టౌన్: ప్రముఖ కవి రౌతు బంగారునాయుడు ప్రముఖ జర్నలిస్ట్ కేఎస్‌వై పతంజలి సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో శనివారం రాత్రి పతంజలి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సాహితీ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీశెట్టి బాబ్జీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పతంజలి సాహిత్య పరామర్శను ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు వివరించారు. అనంతరం రౌతు బంగారునాయుడుకు పురస్కారం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్త పాదిలాపు శ్రీనివాస్, అధిక సంఖ్యలో సాహితీవేత్తలు, జర్నలిస్టులు, అభిమానులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి


అల్యుమినియం రోలింగ్ మిల్లును తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

విజయనగరం టౌన్: కర్మాగారాల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి జయకల్యాణి సూచించారు. వీటీ అగ్రహారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న రాఘవేంద్ర అల్యూమినియం రోలింగ్ మిల్స్‌ను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. సిబ్బంది పనివేళలు, వేతనం, పనివేళల్లో రక్షణ ఏర్పాట్లు, సిబ్బంది పీఎఫ్, , ఈఎస్ఐ, తదితర సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మిల్లు యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

16 నుంచి ఏయూఈఈటీ రెండో దశ ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సెల్ఫ్ సపోర్ట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నుంచి రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సంచాలకులు ఆచార్య డీపీ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఖాళీల వివరాలను ఈ నెల 21వ తేదీన వెబ్‌సైట్‌లో ఉంచుతారు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఇవ్వాలి. రెండో దశ సీట్ల కేటాయింపు ఈ నెల 27న జరుపుతారు. ప్రవేశాలు పొందిన వారు ఈ నెల 28 నుంచి జూలై 4వ తేదీ వరకు నిర్ణీత ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

గురుబ్రహ్మ, గురుశిరోమణి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాల అభివృద్ధికి, సమాజ వికాసానికి దోహదపడే గురువులందరూ గురుబ్రహ్మ, గురుశిరోమణి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సర్వేజనా సుఖినోభవంతు సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈఎస్ నారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువులకు వందనం పేరుతో జూలై 21న గురుపౌర్ణమి విశిష్ట పర్వదినాన్ని పురస్కరించుకుని అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. విద్య, యోగా, ఆధ్యాత్మిక, ధార్మిక, వైద్య, సంగీతం, సాహిత్యం, సాంస్కృతిక, నృత్య, కళ, క్రీడా వంటి పలు రంగాల్లో బోధిస్తున్న గురువులకే పురస్కారం అందజేస్తామన్నారు. వివరాలకు సెల్: 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹148	₹266	₹276

పడకేసిన వన్‌ధన్ కేంద్రాలు..


సీతంపేటలో మూసివేసి ఉన్న జీడి ప్రాసెసింగ్ యూనిట్

- తెరుచుకుకోని జీడి, చింతపండు ప్రాసెసింగ్ యూనిట్లు
- దళారీలు రంగప్రవేశం
- అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రమే ..


వీడీవీకే జీడి ప్రాసెసింగ్ కేంద్రంలో యంత్రాలు


చింతపండు, కొండచీపుర్ల యూనిట్ల దుస్థితి

సీతంపేట: మన్యం ప్రాంతంలో ఏర్పాటు చేసిన వీడీవీకేలు (వన్‌ధన్ వికాస్ కేంద్రాలు) నిదరోతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు, మూడు తప్ప మిగతావన్నీ పడకేశాయి. వెలుగు ఆధ్వర్యంలో వివిధ రకాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినా చెప్పుకోదగ్గ పనితీరు కనబరచడం లేదు. దీంతో గిరిజనోత్పత్తులకు సరైన మార్కెటింగ్ లేక తప్పనిసరి పరిస్థితుల్లో దళారీలను ఆశ్రయించక తప్పడం లేదు. గిరిజనుల ప్రధాన ఆదాయ వనరులైన చింతపండు, జీడి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, తద్వారా గిరిజనుల జీవనోపాధులు మెరుగుపర్చాలనేది ఐటీడీఏ ఆశయం. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సీజన్‌లో చింతపండు కొనుగోలు చేసి ప్రాసెస్ చేసి ప్యాకెట్ల రూపంలో తయారు చేసి వసతిగృహాలు, ఇతర మార్కెటింగ్ కేంద్రాలకు విక్రయించాలని గతంలో నిర్ణయించారు. వీటికి సంబంధించిన యంత్రాలను కూడా కొనుగోలు చేశారు. భవనాలు నిర్మించి సంబంధిత యంత్రాలను ఏర్పాటు చేశారు. ఐటీడీఏకు కూతవేటు దూరంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రస్తుతం మూతపడి ఉంది.

జీడి ప్రాసెసింగ్‌దీ అదేదారి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఏడు జీడి ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో 300 మంది సభ్యులకు భాగస్వామ్యం కల్పించారు. జీడి పిక్కలు కొనుగోలు చేసి పప్పు తయారు చేసి మార్కెటింగ్ చేసి, వచ్చిన ఆదాయాన్ని అందరూ పంచుకోవాలి. ఇందుకు అవసరమైన యంత్రాలను సైతం రూ. 15 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఇలా ఏడు యూనిట్లకు కోటి రూపాయల వరకు ఖర్చు చేశారు. ఇందులో రెండు, మూడు తప్ప మిగిలిన కేంద్రాలు పనిచేస్తున్న దాఖలాలు లేవు. గతంలో శంభాంలో కూడా ఈ తరహాలోనే ప్రాసెసింగ్ కేంద్రాన్ని నెలకొల్పి కొంతకాలం నడిపారు. మహిళా సంఘాలుప్రాసెస్ చేసి జీడిపిక్కలు తీసినప్పటికీ సరైన మార్కెట్ లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. దీంతో కేంద్రం మూతపడింది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే మార్కెటింగ్ కేంద్రాలు మూసివేశారు. ఐటీడీఏ ప్రాంగణంలో ఈ సంవత్సరం వీడీవీకే ఆధ్వర్యంలో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసినా ఇంతవరకు తెరుచుకోకపోవడం గమనార్హం. చింతపండు సీజన్ ఇక ముగిసిపోతుంది. కొండచీపుర్ల యూనిట్‌దీ అదే పరిస్థితి.

బాగానే నడుస్తున్నాయి...

సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఏడు జీడి ప్రాసెసింగ్ యూనిట్లు బాగానే నడుస్తున్నాయి. యూనిట్ల ద్వారా వీడీవీకేలకు ఉపాధి కల్పించడం జరుగుతుంది. చింతపండు, కొండచీపుర్ల యూనిట్లు పనిచేస్తున్నాయి.
– సన్యాసిరావు, వెలుగు ఏపీడీ, సీతంపేట ఐటీడీఏ

వీడీవీకేలను అలాగే వదిలేశారు



వీడీవీకేల ద్వారా నడుస్తున్న యూనిట్లను అలాగే వదిలేశారు. ఎటువంటి పనితీరు లేదు. ఇప్పటికైనా తగిన ప్రోత్సాహమివ్వాలి. ఈ సీజన్‌లో జీడి యూనిట్లు సక్రమంగా పనిచేసే విధంగా చూడాలి. ఐటీడీఏ పరంగా జీడి పిక్కలు కొనుగోలు చేయాలి.
– ఎస్.రామకృష్ణ, ముత్యాలు, ఎఫ్‌పీఓ మెంబర్

అప్పుడప్పుడు తెరుస్తారు..

రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు, మంత్రులు, ఇతర ముఖ్యమైన వారు వచ్చినప్పుడు మాత్రమే జీడి ప్రాసెసింగ్ కేంద్రాలు నడిపిస్తున్నామంటూ తెరుస్తారు. వారు వెళ్లిన తర్వాత మళ్లీ మూసివేస్తారని పలువురు గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఏజెన్సీలో చింతపంట సుమారు 5 వేల హెక్టార్లలో పండగా, జీడి మరో 20 హెక్టార్లలో పండుతుంది. ప్రాసెసింగ్ యూనిట్లు మూతపడడం, మార్కటింగ్ సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారీలను ఆశ్రయించక తప్పడం లేదు. ప్రస్తుతం కిలో జీడి పిక్కలు 105 రూపాయలకు దళారీలు కొనుగోలు చేస్తున్నారు.

ఇదేమి చోద్యం..!


ఇళ్ల స్థలాల్లో జేసీబీతో పిల్ల కాలువ పనులు చేపడుతున్న దృశ్యం

- నిరుపేదల ఇళ్ల స్థలాల్లో 'తోటపల్లి' పిల్ల కాలువ తవ్వకాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో నిరుపేదలకు ఇచ్చిన స్థలాల్లో తోటపల్లి ప్రాజెక్ట్ పిల్ల కాలువ తవ్వకాలు చేపడుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దమరసింగి వెళ్లే రహదారిలో సర్వే నంబర్ 45/1లో సుమారు 16 మంది నిరుపేదలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అయితే స్థానిక టీడీపీ నాయకులు కావాలనే అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి తోటపల్లి కెనాల్ కాలువ నుంచి ఇళ్ల స్థలాల మీదుగా అక్రమంగా పిల్ల కాలువను తవ్విస్తున్నారు. ఇదిలా ఉంటే ఇళ్ల స్థలాలకు ఆనుకుని పూర్వం కాలువ ఉండేదని, మట్టితో కప్పేయడంతో పాత కాలువనే తిరిగి తీస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ ధర్మరాజు వివరణ కోరగా.. ఫిర్యాదు అందితే పరిశీలిస్తామని, ఇళ్ల స్థలాల మధ్యలో కాలువ నిర్మాణం చేపడితే తొలగిస్తామన్నారు. తోటపల్లి జేఈ సంతోషి స్పందిస్తూ ఇళ్ల స్థలాలు తోటపల్లి కాలువ పరిధిలో లేవని, పూర్వం నుంచి ఉన్న కాలువనే తవ్వుతున్నట్లు అక్కడి రైతులు తమకి చెప్పారని బదులిచ్చారు.

రోగులను రక్షించడమే సర్జన్ల లక్ష్యం


రక్తదానం చేస్తున్న రక్తదాతలు

- అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు తిరుమలప్రసాద్

విజయనగరం ఫోర్ట్: రోగులను రక్షించడం కోసం సర్జన్లు పరితపిస్తారని, ఈ క్రమంలో ఎంతో మంది సర్జన్లు తమ జీవితాన్ని అంకితం చేశారని అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె. తిరుమల ప్రసాద్ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా డే సందర్భంగా రోటరీ, విజయ బ్లడ్ బ్యాంక్‌ల్లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్జికల్ అసోసియేషన్ ప్రపంచంలోని అతి పెద్ద అసోసియేషన్‌గా పేర్కొన్నారు. రోగుల ప్రాణాలు కాపాడే సమష్టి ప్రయత్నంలో సర్జిన్లు భాగస్వాములని చెప్పారు. సర్జన్లందరూ సమాజంలో ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి డాక్టర్ ఎ.రమణి, కోశాధికారి ఎ.గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఉదయం జిల్లాకు చేరుకుంటారు. మంత్రి పదవి చేపట్టి జిల్లాకు తొలిసారిగా వస్తున్నారు. ఉదయం విశాఖపట్నంలో 9 గంటలకు బయలుదేరి, 10 గంటలకు జిల్లాకు చేరుకుంటారు. ముందుగా పైడితల్లి అమ్మవారి దర్శనం చేసుకుంటారు. పార్టీ కార్యాలయంలో 10.30 గంటలకు పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 12 గంటలకు స్వస్థలం గంట్యాడ వెళ్లి, స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అక్కడ నుంచి 12.45కి గజపతినగరం వెళ్లి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం విజయనగరంలోని తమ స్వగృహం చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి జిల్లా పరిషత్ అతిథి గృహంలో సందర్శకులను కలుస్తారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తవలస: కొత్తవలస నుంచి విజయనగరం వైపు వెళ్లే రైల్వేలైన్‌లో నిమ్మలపాలెం గ్రామ సమీపంలో గల రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. ఈ మేరకు రైల్వే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రవివర్మ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని.. నీలం రంగు షర్ట్ ధరించాడాని ఎస్సై చెప్పారు. మృతుడి వద్ద తాపీపని చేసే సామగ్రి ఉన్నట్లు గుర్తించారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని విజయనగరం రైల్వే ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ఈశ్వరరావు మృతదేహం

మక్కువ: మండలంలోని వెంకట భైరిపురం గ్రామానికి చెందిన మరడ ఈశ్వరరావు (37) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఈశ్వరరావు మద్యానికి బానిసై భార్యా, పిల్లలను సక్రమంగా పట్టించుకోవడం లేదు. ఈ నెల 8వ తేదీన మద్యం తాగేందుకు డబ్బులు కావాలని భార్య కృష్ణవేణిని అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో చచ్చిపోతానని బెదిరించాడు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటల సమయంలో గడ్డి మంది తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడ్ని మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 14వ తేదీ రాత్రి మృతి చెందాడు. భార్య కృష్ణవేణి శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అప్రెంటిస్‌షిప్‌కు 33 మంది ఎంపిక


అప్రెంటిస్‌షిప్ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని వీటి అగ్రహారంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో శనివారం మేధో సర్వో అప్రెంటిస్‌షిప్ క్యాంపస్ డ్రైవ్‌లో 33 మంది ఎంపికయ్యారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ టీవీ గిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ జి.రామాచారి, ఇతర సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇప్పటికే ఐటీఐ ట్రేడ్‌లు పాసైన వారికి, 2024 విద్యాసంవత్సరం ట్రైనింగ్ పూర్తి చేసుకుంటున్న విద్యార్థులను సైతం ఈ క్యాంపస్ డ్రైవ్‌లో అప్రెంటీస్‌కు ఎంపిక చేశారు.

పిడుగు పాటుకు గేదె మృతి


శృంగవరపుకోట: మృతి చెందిన పాడిగేదె


రాజాం సిటీ: పిడుగు ధాటికి ధ్వంసమైన ఇంటి గోడ

శృంగవరపుకోట: పిడుగు పాటుకు గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని సీతారాంపురంలో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం మండల వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగులు కూడా పడడంతో సీతారాంపురంలో ఆర్. శంకరరావుకు చెందిన గేదె మృతి చెందింది. సుమారు లక్షా యాభై వేల రూపాయల విలువైన గేదె చనిపోవడంతో బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నాడు.

కొండపేటలో..

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి కొండంపేటలో పిడుగులు పడి పలువురి ఇళ్లల్లో గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. శనివారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో గ్రామానికి చెందిన అయ్యప్పస్వామి ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావు ఇంటిపై పిడుగుపడింది. దీంతో ఇంటి గోడ కూలిపోవడంతో పాటు టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్, ఫ్యాన్ పాడయ్యాయి. అలాగే అదే వీధికి చెందిన చిప్పాడ సూర్యనారాయణ, రావి రాంబాబులతో పాటు మరికొంత మందికి చెందిన సుమారు 20 వరకు సీలింగ్ ఫ్యాన్లు, 10 వరకు టీవీలు కాలిపోయాయి.

వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రవికిరణ్

రాజాం సిటీ: మండల పరిధి గడిముడిదాం గ్రామానికి చెందిన ముడిదాన గురయ్య (42) శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గురయ్య తన భార్యాపిల్లలతో కలిసి విశాఖపట్నం ఉంటున్నాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు జరగడంతో స్వగ్రామానికి వచ్చి మళ్లీ విశాఖ వెళ్లిపోయాడు. వారం రోజుల కిందట టీవీ తీసుకువచ్చి ఇంటిలో ఒక్కడే ఉంటున్నాడు. ఎవ్వరితో మాట్లాడేవాడు కాదు. ఇదిలా ఉంటే శనివారం మధ్యాహ్నం ఇంటిలో నుంచి మాడు వాసన రావడంతో స్థానికులు చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై. రవికిరణ్ తెలిపారు.

మనస్తాపంతో మరొకరు..

భామిని: భార్య మాట వినడం లేదని తీవ్ర మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే... మండలంలోని బిల్లుమడ కాలనీలో గంగాధర పద్మనాభం చిన్న హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. శుక్రవారం ఉదయం హోటల్ తీసే సమయానికి అతని భార్య రాకపోవడంతో మందలించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో మనస్తాపానికి గురైన పద్మనాభం పురుగు మందు తాగాడు. వెంటనే భార్య, స్థానికులు గమనించి 108 వాహనంలో భామిని పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పి. కాంతారావు తెలిపారు.

గంజాయితో ఒకరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సురేంద్రనాయుడు

గంట్యాడ: గంజాయి తరలిస్తున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రనాయుడు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం శెట్టిబంద గ్రామానికి చెందిన వంతలు డంబుతో పాటు మరో నలుగురు వ్యక్తులు ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి నుంచి 49 కిలోల గంజాయిని తీసుకువచ్చి విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఓ వ్యక్తికి అప్పగించేందుకు బేరం కుదుర్చుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం నిందితులు ఆటోలో గంజాయి తీసుకువస్తూ కొరారుబిల్లి జంక్షన్ వద్దకే వచ్చేసరికి సరుకు అప్పగించాల్సిన వ్యక్తికి ఫోన్ చేశారు. ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రావడానికి కొంత సమయం పడుతుందని చెప్పడంతో నిందితులు బుడతానపల్లి రోడ్డులో ఉన్న ప్రభుత్వ కళాశాల వద్దకు చేరుకున్నారు. ప్రధాన నిందితుడు డంబును అక్కడే ఉంచి మిగిలిన నలుగురు బయటకు వెళ్లారు. గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి దాడిచేసి నిందితుడి అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో ఉన్న ఆటోను సీజ్ చేశారు. డంబును కోర్టులో హాజరుపరచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు సబ్‌జైల్‌కు తరలించారు. మిగిలిన నలుగురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ చెప్పారు.